# సకల విద్యల సారము ప్రేమతత్త్వమే!

*పరమాత్ముని పవిత్ర పదములు విశ్వమువలెను విరాట్రూపములు*
*గగనము వలెను సువిశాలములు, పాతాళమునను పరివ్యాప్తములు*
*ఆయన దాల్చిన ఆ కిరీటము – బ్రహ్మాండమునకు అతీతము!*
*ఆ భగవంతుడు అగమ్యుడు! అగోచరుడు! అతులితుడు!*

(కన్నడ కవిత)

విద్యార్థినీ విద్యార్థులారా! అధ్యాపకులారా!

కన్నడభాషలో ఉపన్యాసాలివ్వటం నాకు అలవాటు లేదు. దేనికైనా అభ్యాసం అవసరం. నాకు కన్నడలో మాట్లాడే అవకాశం ఎప్పుడోగాని లభించదు. కస్తూరి మీకు తెలుసు. ఆయన సుమారు 30 సంవత్సరాలు నాదగ్గర ఉన్నాడు. తనకు చిక్కిన అవకాశాన్ని సేవ, సాధనల ద్వారా సద్వినియోగం గావించుకున్నాడు. కన్నడభాషలో ఆయన పేరెన్నికగన్న రచయిత, చాలా పవిత్రహృదయుడు, చక్కని సృజనాత్మకశక్తి కల్గినవాడు. ఆయనను అందరూ 'కన్నడ కస్తూరి' అని పిలిచేవారు. ఆయన పలికే ప్రతి పలుకులోను కన్నడభాషయొక్క తీయదనము, పవిత్రత వ్యక్తమౌతూఉండేవి. కాని, నేను మాట్లాడే కన్నడం అంత గొప్పగా ఉండకపోవచ్చు. అక్కడక్కడ పొరపాట్లు దొర్లవచ్చు.

**నారాయణభట్ సేవాతత్పరత**

నారాయణభట్ కర్ణాటకలో రెండు స్కూళ్ళు స్థాపించాడు – దక్షిణ కన్నడ జిల్లాలోని అళికెలో ఒకటి. కోలార్ జిల్లాలోని ముద్దనహళ్ళిలో రెండవది. సత్యసాయి విద్యావిధానమును అమలు పరచే ఆదర్శవిద్యాసంస్థలుగా వాటిని తీర్చిదిద్దటానికి అతను ఎంతో కృషి చేశాడు. అయితే వాటి అభివృద్ధికోసం అతను ఎన్నో అప్పులు కూడా చేశాడు. ఆ అప్పులను తీర్చటానికి అతనికి సాధ్యం కాలేదు. అతను, అతని తల్లి అనేక గ్రామాల్లో, పట్టణాల్లో పర్యటించి, శ్రీమంతులను కలుసుకొని స్కూళ్ళకోసం విరాళాలను సేకరించటానికి ప్రయత్నించారు. కాని అప్పులు రోజురోజుకూ పెరిగిపోతూవచ్చాయేగాని, అవి తరిగే మార్గం కనిపించలేదు. ఒకపర్యాయం నారాయణభట్ నావద్దకు వచ్చి పరిస్థితినంతా వివరించాడు. "స్వామీ! అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణ మమ, మీరు తప్ప నాకు దిక్కు లేదు. కరుణించి ఈ రెండు స్కూళ్ళ నిర్వహణను మీరు స్వీకరించి నన్ను తరింపజేయండి" అని ప్రార్థిస్తూ వచ్చాడు.

"నారాయణభట్! ధైర్యంగా ఉండు. అన్నీ నేను చూసుకుంటాను. నీవు జీవించి నంతకాలం ఆ స్కూళ్ళను నీ ఆధీనంలోనే ఉంచుకో" అని నేను ధైర్యం చెబుతూ వచ్చాను. "ఆధ్యాత్మిక విలువలను బోధిస్తూ, సేవాకార్యక్రమాలలో పాల్గొంటూ ఆనందంగా ఉండు" అని ఆశీర్వదించాను. అప్పటి నుండి నారాయణభట్ అధైర్యాన్ని విడిచిపెట్టి, ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పనిచేస్తూ ఈ స్కూళ్ళను బాగా అభివృద్ధికి తెచ్చాడు; ఆదర్శవిద్యాసంస్థలుగా తీర్చిదిద్దాడు. సాధకులకు మరియు సేవాభావం గలవారికి మార్గదర్శిగా నిలిచాడు. "యద్భావం తద్భవతి." అతని సత్సంకల్పానికి తగినట్లు అనేకమంది గుణవంతులు, మేధావంతులు మరియు త్యాగభావం కలిగిన అధ్యాపకులు అతనికి తోడుగా నిలిచారు. వారి సర్వస్వాన్ని త్యాగం చేసి ఈ బృహత్కార్యంలో అతనికి అన్ని విధాలుగా సహకరించారు. ఇప్పుడుకూడా ఆ అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తూ ఈ సంస్థలను విజయవంతంగా నడిపిస్తున్నారు.

నారాయణభట్ క్షణమైనా విశ్రాంతి తీసుకోకుండా రాత్రింబవళ్ళు పనిచేస్తూ తన సేవాకార్యక్రమాన్ని కొనసాగించాడు. అయితే ఎవరైనా సరే కాలం తీరినపుడు కాయం వదలిపెట్టక తప్పదు కదా! భగవంతుడు

కాలస్వరూపుడు. కాలం ఎవరికీ లొంగదు. అందరూ కాలానికి లొంగవలసినదే! 1978 లో నారాయణభట్ కారుప్రమాదంలో దేహాన్ని వదలిపెట్టాడు. అతని మరణంతో ఆ విద్యాసంస్థలు అనాథలైనాయి. అప్పుడు గంగాధరభట్, నారాయణరావు, నరసింహమూర్తి... వీళ్ళందరూ నావద్దకు వచ్చి "స్వామి! మీరు నారాయణభట్‌కు వాగ్దానం చేసినట్లుగా ఈ సంస్థలను స్వీకరించి మమ్మల్ని ఆదుకోండి" అని ప్రార్థించారు. ఈనాటి విద్యావిధానాన్ని సరియైన మార్గంలో ప్రవేశపెట్టి, విద్యార్థులను ఆదర్శ ప్రాయులుగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. ఇటువంటి మంచి పనులను ఎవరు చేపట్టినా నేను వారికి తగినరీతిగా ఉత్సాహప్రోత్సాహములనందిస్తాను. ఐతే అళికె, ముద్దనహళ్ళి స్కూళ్ళ బాధ్యతను నేను స్వీకరించటంతోపాటు వాటి నిమిత్తం చేయబడిన ఋణాన్నికూడా నేను తీర్చవలసి ఉండినది. అది అంతో ఇంతో కాదు? ఆరోజుల్లోనే పదిలక్షల ఋణభారం ఆసంస్థపై ఉండినది. మరొకవైపున ఆ టీచర్లందరూ "స్వామి! మీరే మా సర్వస్వం. మీరే మమ్మల్ని  కాపాడాలి" అని ప్రార్థిస్తూ వచ్చారు. త్రికరణశుద్ధితో కూడిన వారి ప్రార్థన నా హృదయాన్ని కరిగించింది. వెంటనే నేను ఆ విద్యాసంస్థలను స్వీకరించి, వాటికి ఋణభారంనుండి విముక్తి కలిగించాను.

ముద్దనహళ్ళికి వెళ్లాలంటే నాకెంతో ఇష్టం

అప్పటినుండి నేను బృందావనానికి వెళ్ళేటప్పుడుగాని, లేక అక్కడినుండి ఇక్కడికి వచ్చేటప్పుడుగాని మార్గమధ్యంలో ముద్దనహళ్ళివద్ద కొద్దిసేపు ఆగి అక్కడి విద్యార్థులతో మాట్లాడుతూ వారికి ఉత్సాహప్రోత్సాహములను అందిస్తూ వచ్చాను.. "దర్శనం పాపనాశనం, స్పర్శనం కర్మవిమోచనం, సంభాషణం సంకటనాశనం." ఈవిధంగా దర్శన, స్పర్శన, సంభాషణలతో వారి చింతలూ, కష్టాలూ తొలగిపోయాయి. అధ్యాపకులు ప్రశాంతచిత్తముతో, ఇనుమడించిన ఉత్సాహంతో పనిచేస్తూ స్కూలును ఎంతో అభివృద్ధికి తెచ్చారు. క్రమేణ అక్కడ ఇంగ్లీషు మీడియం (సి.బి.ఎస్.ఇ) తరగతులనుకూడా ప్రారంభించారు. ఆ అధ్యాపకులందరూ చాలా పవిత్ర హృదయులు. ఒకరిని చూసి ఒకరు మంచిగుణాలను అలవరచుకొంటూ, నైతిక ఆధ్యాత్మిక విలువలను అభివృద్ధిపరచుకొంటూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు.

ఆధ్యాత్మికమార్గంలో సత్సంగము చాలా ప్రధానమైనది. దుస్సంగానికి దూరంగా ఉండాలి. సత్పురుషుల సాంగత్యాన్ని కోరుకోవాలి. సంస్థల అభివృద్ధికోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలి. ఈ విషయంలో అళికె మరియు ముద్దనహళ్ళి అధ్యాపకులు చక్కని ఆదర్శాన్ని అందిస్తున్నారు. పరస్పరం సహకరించుకొని, ఐకమత్యంతో పనిచేసి వాటిని పరిపూర్ణమైన విద్యాసంస్థలుగా తీర్చిదిద్దుతున్నారు. వారి నిరంతర కృషి ఫలితంగా ఈ విద్యాసంస్థలు ఇప్పుడు కాలేజీ స్థాయికి చేరుకొని గొప్ప కీర్తి గడించాయి. ప్రజలు వీటిని  శ్రీ సత్యసాయి కాలేజీలని కీర్తిస్తున్నారు. మున్ముందు ఇవి మరిన్ని సదుపాయాలను సమకూర్చుకొని పూర్తిస్థాయిలో పని చేసే కాలేజీలుగా రూపొందగలవు. ముద్దనహళ్ళికి వెళ్ళాలంటే నాకెంతో ఇష్టం. పూర్వం అనేకసార్లు అక్కడికి వెళ్ళి విద్యార్థులకు, అధ్యాపకులకు తగిన సూచనలు, సలహాలను అందిస్తూవచ్చాను. కాని, ఇప్పుడు కాలం మారింది, పరిస్థితులూ మారిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడికి ఇంతకు పూర్వం మాదిరి తరచుగా వెళ్ళడానికి వీలుకాదు. ఇప్పుడు నా కారువెనుక వందలాది కార్లు బయలుదేరుతాయి. అంతమందికి భోజన, వసతి సౌకర్యాలను కల్పించటం చాలా శ్రమతో కూడుకున్న పని. ఆ టీచర్లను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశ్యంతోనే నేను అక్కడికి వెళ్ళడం తగ్గించాను.

ఇంక అళికె విషయానికి వద్దాము. ముద్దనహళ్ళి స్కూలుతోపాటుగా అళికె స్కూలును కూడా నాకు అప్పగించారు. అళికె ఇక్కడికి చాలా దూరంలో ఉన్నది. కనుక అక్కడికి తరచుగా వెళ్ళిరావడానికి వీలుకాదు. అంతమాత్రంచేత అళికెపై స్వామికి ప్రేమలేదని భావించరాదు. స్వామిని అళికెకు రావలసిందిగా వాళ్ళు అనేక సంవత్సరాలుగా ప్రార్థిస్తూ వచ్చారు. రెండేళ్ళ క్రితం ఒక రోజున గంగాధరభట్ "స్వామి! మాకు వయస్సు

పైబడుతున్నది. మేము బ్రతికి ఉండగా కనీసం ఒక్కసారైనా మీరు మా గ్రామానికి విచ్చేసి మా విద్యాసంస్థలను పావనం చేయాలి" అని ఎంతగానో ప్రార్థించాడు. అతనంతగా ప్రాధేయపడుతుంటే నేను కాదనలేకపోయాను. హృదయపూర్వకమైన అతని ప్రార్థనను నేను అంగీకరించక తప్పలేదు. వెంటనే నేనొక హెలికాప్టర్‌ను అద్దెకు తీసికొని అళికెకు వెళ్ళాను.

అళికెలో ఒక్క గంగాధరభట్ తప్ప ఆ సంస్థను నిర్వహించగల సామర్థ్యం గలవారు మరొకరు లేరు. కనుకనే నేను ఆయనతో చెప్పాను – "గంగాధరభట్! నీవు అళికెలో నా ప్రతినిధిగా ఉంటూ ఈ విద్యాసంస్థను నిర్వహించాలి. నీవు పలికే ప్రతి పలుకులోను, నీవు చేసే ప్రతి చర్యలోను స్వామి ప్రేమతత్త్వం ప్రతిబింబించాలి. నీవు కేవలం ఒక నిమిత్తమాత్రుడవేనని, చేయించేదంతా స్వామియే అన్న దృఢమైన విశ్వాసంతో నీకర్తవ్యాన్ని నిర్వర్తించు" స్వామి ఆదేశాన్ని అనుసరించి గంగాధరభట్ భక్తి శ్రద్ధలతో, అంకితభావంతో తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తిస్తున్నాడు. ఈ విద్యాసంస్థలు రెండూ దిన దినాభివృద్ధి చెందుతున్నాయి. నిన్న కనిపించినట్లు ఈరోజు కనిపించవు. అంత వేగంగా అవి అభివృద్ధి చెందుతున్నాయి. అంకితభావం, త్యాగనిరతి కలిగిన అధ్యాపకుల నిరంతర కృషివలననే ఇది సాధ్యమైంది.

**'ఎడ్యుకేషన్' – 'ఎడ్యుకేర్'**

ప్రశాంతినిలయం, బృందావనం మరియు అనంతపురములలో ఉన్న మా విద్యా సంస్థలు కూడా గొప్ప అభివృద్ధిని సాధించాయి. అది అంతర్ముఖమైన అభివృద్ధి. అది 'ఎడ్యుకేర్' వల్లనే సాధ్యమైంది. 'ఎడ్యుకేర్' అనగా ఏమిటి? మానవునిలో అంతర్ముఖంగా ఉన్న మానవతావిలువలను వెలికితీసేదే 'ఎడ్యుకేర్'. ప్రతి వ్యక్తిలోను మానవతావిలువలు అవ్యక్తంగా ఉన్నాయి. వాటిని ఆవిర్భవింపజేసుకోవాలి. పుస్తకంలో ఉన్న విషయాలను మస్తకంలోకి ఎక్కించుకోవటం 'ఎడ్యుకేర్' అనిపించుకోదు. హృదయకమలాన్ని వికసింపజేయునదే 'ఎడ్యుకేర్'. దీనివలన మనం విలువలను గ్రహించటమేగాక, వాటిని ఆచరణలో పెట్టి ఇతరులకు కూడా అందించగల్గుతాము. ఇందులో బోధన మరియు ఆచరణ రెండూ ప్రధానమైనవి. విద్యార్థులలో అంతర్భూతంగా ఉన్న దివ్యశక్తులు వారు చేసే ప్రతి పనిలోను ప్రతిబింబించాలి. అందునిమిత్తం ఈనాటి విద్యావిధానంలో తగిన మార్పులు తెప్పించాలి.

ఈనాటి విద్యార్థులకు 'ఎడ్యుకేర్' అంటే ఏమిటో తెలియదు. 'ఎడ్యుకేర్' అనే పదంలో గొప్ప అంతరార్థమున్నది. 'ఎడ్యుకేర్' ప్రేమను అభివృద్ధిపరుస్తుంది. సత్యధర్మాలను పోషిస్తుంది. అనాదికాలమునుండి భారతదేశమును అన్నివిధాలుగా సంరక్షిస్తూ వచ్చినవి సత్యధర్మములే! అయితే, సత్యధర్మములు మనకు బయటి నుండి లభించేవి కావు. బయటినుండి లభించేది ఏదీ శాశ్వతమైనది కాదు. హృదయమునుండి ఆవిర్భవించేది ఒక్కటే శాశ్వతమైనది. 'ఎడ్యుకేర్' అనేది హృదయమునుండి ఆవిర్భవించి ఎదుటి వ్యక్తుల హృదయాల్లోకి ప్రవేశిస్తుంది. ఇటీవల ప్రశాంతి నిలయంలో వైస్ ఛాన్స్‌లర్ల సదస్సు జరిగింది. దేశంలోని వివిధ యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్లు 26 మంది అందులో పాల్గొన్నారు. 'ఎడ్యుకేర్'ను గురించి తెలుసుకొవాలని వాళ్ళు ఎంతో ఆసక్తిని కనబర్చారు. అన్ని విద్యాసంస్థల్లోను ఈ విధానమును అమలుచేయాలని ఉత్సాహం వ్యక్తం చేశారు. ఈ ప్రపంచములో విద్యను మించిన ధనము లేదు. అయితే, విద్య అంటే 'బుకిష్ నాలెడ్జి' కాదు. 'ఎడ్యుకేర్' అనేదే నిజమైన విద్య. ప్రాపంచికమైన విద్య (ఎడ్యుకేషన్) మస్తకమునుండి ఆవిర్భవిస్తుంది. నిజమైన విద్య (ఎడ్యుకేర్) హృదయము నుండి ఆవిర్భవిస్తుంది.

విద్యార్థులారా! మీరు ఏ కర్మనాచరించినప్పటికీ ప్రేమను ఆధారం చేసుకోవాలి. హృదయంలో ప్రేమను నింపుకోవాలి. అదే 'ఎడ్యుకేర్.' సత్యధర్మములు రెండూ ప్రేమయొక్క ప్రతిబింబములే! సత్యధర్మములను అనుసరించినప్పుడే మీరు శాంతిని అనుభవించగలరు. మీ హృదయాన్ని ప్రేమమయం గావించుకుంటే చాలు,

మీ జన్మ సార్థకమౌతుంది. ద్వాపరయుగంలో గోపికలు ప్రేమద్వారానే కృష్ణుని పొందగలిగారు. "కృష్ణా! మాకు ప్రేమ తప్ప మరొకటి అవసరం లేదు. ప్రేమ లేని హృదయం మరుభూమితో సమానం. కాబట్టి, మా హృదయాలను నీ దివ్యప్రేమతత్త్వంతో నింపు" అని ప్రార్థించారు. అయితే, ప్రేమ అనేది మీరు ఎక్కడినుండో సంపాదించేది కాదు; జన్మతః మీలోనే ఉన్నది. ఆ ప్రేమను కేవలం మీ తల్లిదండ్రులు మరియు బంధుమిత్రులపై మాత్రమేగాక సర్వజీవులపై ప్రసరింపజేయాలి.

ప్రేమ అమృతముకన్న మధురమైనది. సకల విద్యల సారము ప్రేమతత్త్వమే. మీరు స్కూళ్ళలో, కాలేజీల్లో అభ్యసించే విద్య కేవలం 'ఇన్ఫర్మేషన్'కు (విషయపరిజ్ఞానానికి) సంబంధించింది. దానివలన 'ట్రాన్స్‌ఫర్మేషన్' (పరివర్తన) సాధ్యం కాదు. ముఖ్యంగా మీ ప్రేమను విశాలం గావించుకోవాలి. మీ తలంపులను పరిశుద్ధం చేసుకోవాలి. పరిశుద్ధ హృదయులు మాత్రమే భగవత్తత్త్వాన్ని గుర్తించగలరు. భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపం లేదు. ప్రేమయే భగవత్స్వరూపం. కాబట్టి, మీ హృదయంలో ప్రేమను ప్రతిష్ఠించుకోండి. ప్రేమ ఒక్కటే మీకు కష్టాలనుండి విముక్తి ప్రసాదించగలదు. వేదము "శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః" అన్నది. మీరు అమృతపుత్రులేగాని, అనృతపుత్రులు కారు. మిమ్మల్ని మీరు అనృతపుత్రులుగా భావించుకోవటంచేతనే బలహీనులవుతున్నారు. 'మేము అమృత పుత్రులం' అని దృఢంగా విశ్వసించండి. అప్పుడే మీ హృదయంలో నిజమైన ప్రేమ ఆవిర్భవించి దివ్యమైన ఆత్మానందమును అనుభవింపజేస్తుంది.

**ఆత్మయే పరమ సత్యం, పరమ గమ్యం**

మీరు పుట్టినది దివ్యమైన ప్రేమతత్త్వాన్ని అనుభవించటానికే గాని, తిని తిరగడానికి కాదు. ఈసత్యాన్ని గుర్తించండి. దేహముపట్ల మమకారమును పెంచుకోకండి. దేహాభిమానమును విడిచిపెట్టనంత వరకు మీరు ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోలేరు. "నేను ఎవరిని? ఎక్కడినుండి వచ్చాను? ఎక్కడికి పోతాను? ఇక్కడ ఎంతకాలం ఉంటాను?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఆత్మవిచారణ అనేది ఈప్రశ్నలతోనే ప్రారంభమౌతుంది. మీరు ఆత్మస్వరూపులేకాని, దేహస్వరూపులు కారు. ఈ జగత్తులో అన్ని వస్తువులూ రూప నామములతో కూడిఉన్నాయి. కాని, ఆత్మకు రూపనామములు లేవు. ఆత్మతత్త్వాన్ని గుర్తిస్తే మీరు పరమాత్మతత్త్వాన్ని గుర్తించినవారవుతారు. అదే పరమసత్యం. అదే పరమగమ్యం. అదే పరమతృప్తి. అట్టి ఆత్మతత్త్వాన్ని, అమృతత్త్వాన్ని అనుభవించాలంటే మీరు ప్రేమస్వరూపులుగా రూపొందాలి. ప్రేమనుండియే మీకు పరిపూర్ణమైన శాంతి లభిస్తుంది. అందరూ 'మాకు శాంతి కావాలి' అని అడుగుతుంటారు. శాంతి అనేది స్వర్గము నుండి ఊడిపడదు. అది ప్రేమనుండియే ఆవిర్భవిస్తుంది. ప్రేమయే భగవత్సాక్షాత్కారానికి రాజమార్గం. భగవంతునికోసం మీరు ఇక్కడా, అక్కడా వెదకనక్కర్లేదు. తాను ప్రేమస్వరూపునిగా మీయందే ఉన్నాడు. మీ హృదయం ప్రేమమయమైనప్పుడు మీరే భగవత్స్వరూపులవుతారు. కాబట్టి, మీ ప్రేమను విశాలం గావించుకోండి. భగవంతుడు మీయందే ఉన్నాడన్న సత్యాన్ని గుర్తించనంతవరకు మీకు బాధలు తప్పవు.

**ఆదర్శమూర్తి గంగాధరభట్**

ఈసందర్భంలో గంగాధరభట్ గురించి మీకు మరికొన్ని విషయాలు చెప్ప దల్చుకున్నాను. ఇతను మడియాల నారాయణభట్‌కు కుడిభుజంగా ఉంటూ అన్నివిధాలుగా అతనికి సహాయసహకారాలనందిస్తూ వచ్చాడు. ఒక పర్యాయం నారాయణభట్ చెప్పాడు "గంగాధరభట్! నీవు ఏ పని చేసినప్పటికీ సంస్థమొక్క శ్రేయస్సు దృష్టిలో పెట్టుకో. నీకేదైనా సమస్య ఎదురైతే హృదయపూర్వకంగా స్వామిని ప్రార్థించు. స్వామియే నీకు మార్గం చూపిస్తారు." ఆనాటినుండి గంగాధరభట్ స్వామిపట్ల అచంచలమైన విశ్వాసంతో తన కర్తవ్యకర్మలను నిర్వర్తిస్తూవచ్చాడు. స్వామియే తన ప్రత్యక్షదైవమని, తన జీవనాధారమని విశ్వసించాడు. స్వామికి సంపూర్ణంగా శరణాగతుడైనాడు. అచంచలమైన భక్తితో, అంకిత భావంతో అళికె, ముద్దనహళ్ళి విద్యాసంస్థల అభివృద్ధికోసం

తాను అహర్నిశలు కృషి సల్పుతున్నాడు. అతని నేతృత్వంలో ఆ సంస్థలు ఎంతో అభివృద్ధిని సాధించాయి.

నేను 1979లో తొలిసారిగా అళికెకు వెళ్ళినప్పుడు అక్కడ ఏవో రెండు మూడు చిన్నచిన్న భవనాలు కనిపించాయి. మళ్ళీ రెండు సంవత్సరాల క్రిందట వెళ్ళేటప్పటికి ఆ విద్యాసంస్థ రూపురేఖలే మారిపోయాయి. ఆ సంస్థ సాధించిన అద్భుతమైన ప్రగతిని చూసి నాకే ఎంతో ఆశ్చర్యం కలిగింది. అళికె సువిశాలమైన భవనాలు కలిగిన ఒక సుందరమైన పట్టణంగా మారిపోయింది. అయితే గొప్పతనం అంతర్ముఖమైన అభివృద్ధిని సాధించటంలోనే ఉన్నదిగాని, భవనాలను నిర్మించుకోవటంలో లేదు. నగరాలలో, పట్టణాలలో ప్రజలు పెద్దపెద్ద భవనాలను నిర్మించుకుంటారు. కాని, ఏమి ప్రయోజనం? వారి మనస్సు నిండా దురాలోచనలే! దుర్భావములే!

ఈరోజు చిన్నచిన్న పిల్లలు వేదికమీదికి వచ్చి ఎంతో చక్కగా ప్రసంగించారు. ముఖ్యంగా ఆ హైస్కూలు విద్యార్థి చేసిన ప్రసంగం నన్నెంతగానో ఆకట్టుకుంది. అతను హృదయపూర్వకమైన ప్రేమభావంతో ప్రసంగించాడు. ఈవిధంగా విద్యార్థులను ఆదర్శప్రాయులుగా తీర్చిద్దిడానికి గంగాధరభట్ ఎంతగానో కృషి చేస్తున్నాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ అన్నింటినీ తట్టుకొని నెట్టుకొని స్వామిపట్ల అచంచలమైన విశ్వాసంతో ధైర్యంగా ముందుకు సాగుతున్నాడు. ఒక పర్యాయం అతను నావద్దకు వచ్చి “స్వామీ! నేను వృద్ధుడనైపోయాను. వయోభారము వలన ఈ సంస్థలను సమర్థవంతంగా నిర్వహించ లేకపోతున్నాను. కాబట్టి, నా స్థానంలో ఎవరైనా ఒక మంచివ్యక్తిని నియమించి నాకు ఈ బాధ్యతనుండి విముక్తి ప్రసాదించండి” అని ప్రార్థించాడు. మంచిచెడ్డలు మన దృష్టిలోనే ఉన్నాయి. నిజంగా నా దృష్టిలో చెడ్డవారు ఎవరూ లేరు. అందరూ మంచివారే! నేను చెప్పాను “గంగాధరభట్! నీవు ట్రస్టు చైర్మన్ పదవిలో కొనసాగవలసిందే! నీవెంట నేనున్నాను. అన్నీ నేను చూసుకుంటాను. అధైర్యపడకు” అని. స్వామి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ వస్తున్నాడు.

**తపస్సనగా ఏమిటి?**

కర్తవ్యాన్ని విస్మరించి ఎక్కడో అరణ్యానికి పోయి తపస్సు చేసుకోవాలనుకోవటం వెఱ్ఱితనం! అసలు తపస్సనగా ఏమిటి? ఏ పనీ చేయకుండా కళ్ళుమూసుకొని ‘కృష్ణా! రామా!’ అనుకుంటూ కూర్చోవటమా? కాదు, కాదు. సత్సంకల్పాలను, సద్గుణాలను అభివృద్ధి పరచుకొని నిరంతరం సత్కర్మలనాచరించటమే నిజమైన తపస్సు. మనోవాక్కాయ కర్మలను ప్రేమమయం గావించుకోవటమే నిజమైన తపస్సు. అళికె మరియు ముద్దనహళ్ళి అధ్యాపకులు చేస్తున్నది అదే! అందుచేతనే వాళ్ళు విద్యార్థులను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దగల్గుతున్నారు. ఈ ఉత్సవంలో పాల్గొనటానికి వచ్చిన విద్యార్థులను చూస్తుంటే నాకెంతో ఆనందంగా ఉన్నది. మాస్కూలులో మరియు ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులను ఎంపిక చేసేటప్పుడు అళికె, ముద్దనహళ్ళి విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా నేను అధికారులకు చెబుతుంటాను. నేను కోరేది ప్రేమ ఒక్కటే! మీరు ఈ ప్రపంచాన్నంతా ఇచ్చినా నాకు అవసరం లేదు. మీ ప్రేమను నాకివ్వండి, చాలు. మీ హృదయక్షేత్రంలో ప్రేమబీజాన్ని నాటుకోండి. అదే క్రమక్రమేణ కల్పవృక్షముగా రూపొంది. జగత్తుకు సుక్షేమాన్ని చేకూర్చుతుంది.

విద్యార్థులారా! ముఖ్యంగా మీ తల్లిదండ్రుల ఆజ్ఞలను శిరసావహించండి. తల్లిదండ్రులే ప్రత్యక్షదైవస్వరూపులు. మీ తల్లి మిమ్మల్ని నవమాసాలు మోసి కని పెంచి పెద్దచేసింది. మీ అదృష్టానికి మరియు అభివృద్ధికి తల్లియే మూలకారణం. కాబట్టి, తల్లికి మీరు మొట్టమొదట కృతజ్ఞత చూపండి. తల్లి అనుగ్రహానికి పాత్రులు కండి. తల్లి అంటే కేవలం దేహమాత మాత్రమే కాదు, ఆమె లోకమాత కూడా. సాక్షాత్తు జగన్మాతయే మీ తల్లి రూపాన్ని ధరించి మిమ్మల్ని పోషిస్తున్నదని విశ్వసించండి. గంగాధరభట్ తన తల్లికి ఎంతో సేవ చేశాడు.

తల్లిని హృదయపూర్వకంగా సేవించినందువల్లనే అతను ఈనాడు స్వామిప్రేమకు పాత్రుడైనాడు. మా నరసింహమూర్తి ప్రశాంతి నిలయంలో వార్డెన్‌గా ఉన్నప్పుడు ఒకనాడు నావద్దకు వచ్చి “స్వామీ! మా అమ్మ

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆమె పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది” అన్నాడు. అప్పుడు నేను “పిచ్చివాడా! నీవు చేప్పేది ఏ తల్లిగురించి? ఈ తల్లిగురించా? ఆ తల్లి గురించా? దేహానికి సంబంధించిన తల్లి ఏనాటికైనాపోక తప్పదు. కాబట్టి నీవు నిత్యసత్యమైన తల్లిని ఆశ్రయించు” అని చెప్పాను. కొన్నిరోజుల తరువాత అతను వచ్చి “స్వామీ! మా తల్లి మరణించింది” అని చెప్పాడు. అప్పుడు నేనతనిని ఓదార్చుతూ “నరసింహమూర్తీ! స్వామియే నీ తల్లి. స్వామిసన్నిధే నీ పుట్టినిల్లు” అని చెప్పాను. అతని తల్లికూడా చాలా పవిత్రహృదయురాలు. “నరసింహమూర్తీ! ఎలాంటి పరిస్థితి యందైనా నీవు స్వామిని వదలిపెట్టకు. నీ జీవితాంతం స్వామిసన్నిధిలోనే ఉండు” అని ఆమె చెబుతూ ఉండేది.

తల్లి ప్రేమస్వరూపిణి. తన పిల్లల క్షేమంకోసం మరియు అభివృద్ధికోసం ఆమె ముక్కోటిదేవతలకు మ్రొక్కుకుంటూ ఉంటుంది. తల్లియొక్క నిస్వార్థప్రేమను అర్థం చేసుకోండి.

(27-01-2004 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపములో శ్రీవారు కన్నడ భాషలో గావించిన దివ్యోపన్యాసం)